
ప్రజాహృదయనేత, పేదల పెన్నిధి
టిపిసిసి ప్రధాన కార్యదర్శి
నర్సారెడ్డి భూపతిరెడ్డి (NBR) గారికి
జన్మదిన శుభాకాంక్షలు
కాంగ్రెస్ పార్టీ - కుత్బుల్లాపూర్ నియోజకవర్గం

క్లుప్తంగా...

భారతీయ మూలాలు నేటి తరానికి ఎంతో అవసరం

సనాతన సంప్రదాయాలతో యువతరాన్ని తీర్చిదిద్దాలి: తమిళిసై



మద్దిలపాలెం(విశాఖ తూర్పు): మన భారతీయ మూలాలు, సనాతన సంప్రదాయాలను నేటి యువతరానికి అందించాల్సిన అవసరం పెద్దలపై ఉందని, ఆ దిశగా కృషి చేయాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. భారతీయత– అమృతకాలంపై రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్. వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ప్రారంభమైంది. సద్గురు శివానందామూర్తి ఆశీస్సులతో సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయం ప్రపంచ దేశాలకు ఎంతో ఆదర్శంగా నిలుస్తున్నాయనీ అలాంటి మన మూలాలు నేటి తరానికి దూరం కాకుండా వారికి చేరువ చేయాలన్నారు. మన జీవన విధానంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పెను ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందనీ, ఇలాంటి తరుణంలో మన పూర్వీకులు పాటించిన ఆధ్యాత్మికత, ఆహారపు అలవాట్లను, సంప్రదాయాలను యువతరానికి అందించాలని సూచించారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత వైస్ అడ్మిరల్ రామన్ పూరి మాట్లాడుతూ మన భారతీయతను భావితరాలకు చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ప్రొఫెసర్ కె. సరస్వతి విద్యార్థిని రచించిన 'పద్మభూషణ్ డాక్టర్ శ్రీపాద పినకపాణి సంగీత నిధి'పుస్తకాన్ని ఆవిష్కరించారు.

23 మందితో తెలుగు మహిళ కమిటీ

సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ అనుబంధ విభాగమైన తెలుగు మహిళ రాష్ట్ర కమిటీలో 23 మందికి చోటు కల్పించారు. వీరికి శనివారం తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా భవనం షకీలా రెడ్డి ఇప్పటికే నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ధనకాడ్ రాధిక (నల్గొండ పార్లమెంటు), అధికార ప్రతినిధిగా లక్ష్మి (నల్లగొండ పార్లమెంటు)తో పాటు ఆరుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, 15 మంది కార్యదర్శులు కొత్తగా నియమితులయ్యారు.

ఉద్దానానికి ఊపిరి

కిడ్నీ వ్యాధికి శాశ్వతంగా చరమగీతం పాడేలా ఏపీ ప్రభుత్వం చర్యలు

రూ.700 కోట్లతో చేపట్టిన మంచి నీటి పథకం ట్రయల్ రన్‌కు సిద్ధం

- ఖర్చుకు వెనకాడకుండా ఏడాది పొడవునా నీటి సరఫరాకు ప్రాధాన్యత
- 100 కి.మీ దూరంలోని హీరమండలం నుంచి నీటి తరలింపు
- నదుల కింద, కొండలను తొలిచి భూగర్భ పైపులైన్ నిర్మాణం
- మొత్తంగా 1047 కి.మీ పొడవునా భూగర్భ పైపులైన్

గ్రౌండ్ రిపోర్ట్



మెలియాపుట్టి వద్ద నీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌లు

ఉద్దానం ప్రాంతం నుంచి మేడికొండ కోటిరెడ్డి, వద్దే బాలశేఖర్: శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో ప్రజలు కిడ్నీ వ్యాధి బారిన పడి అల్లాడుతుంటే గత ప్రభుత్వాలు మాటలతో మభ్యపెడితే.. వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో వేసిన అడుగులు ఫలితాలివ్వడానికి సిద్ధమయ్యాయి. నాలుగు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న నీటి సమస్య పరిష్కారించడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే.. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు రూ.700 కోట్లతో సమగ్ర రక్షిత మంచినీటి పథకం మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం ప్రారంభోత్సవ దశకు చేరింది. హీరమండలం నుంచి తాగునీటిని తరలించే ప్రక్రియలో ఉపయోగించే నీటి మోటార్లకు మూడు, నాలుగు రోజుల్లో ట్రయల్ రన్ మొదలవ్వనుంది.

దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యం

ఉద్దానం ప్రాంతంలో అక్కడి భూగర్భ జలాలనే తాగునీటిగా ఉపయోగించడం వల్ల కిడ్నీ వ్యాధులు ప్రబలుతున్నాయనే వాదన ఉంది. ప్రజల్లో కూడా ఇదే విషయమై ఆందోళన ఉంది. అయితే ఇప్పుడు కూడా ఆ ప్రాంతంలో కొన్ని మంచినీటి పథకాలు ఉన్నా.. అవి ఎక్కువగా స్థానికంగా బోర్లు వేసి సరఫరా చేసేవే. మరోవైపు.. తక్కువ ఖర్చుతో ఉద్దానం ప్రాంత సమీపంలో ఉండే బహుదా, మహేంద్ర తనయ నదుల నుంచి రక్షిత నీటి సరఫరాకు అవకాశం ఉన్నా, వేసవిలో ఆ నదులు ఎండిపోతే ప్రజలు బోరు నీటిని తాగక తప్పదని జగన్ సర్కార్ ఆ ప్రతిపాదనను మొదట్లోనే పక్కన పెట్టింది. ఏడాది పొడవునా నీరు అందుబాటులో ఉండేలా ఖర్చు ఎక్కువైనా సరే వెనుకాడకుండా హీరమండలం రిజర్వాయర్ నుంచి నీటి తరలింపునకు పూనుకుంది. ఉద్దానం ప్రాంతం మొత్తానికి ఏడాది పొడవునా నీటి అవసరానికి ఒక టీఎంసీ కన్నా తక్కువ నీరే అవసరం ఉంటుంది. హీరమండలం రిజర్వాయర్ కనీస నీటి మట్టం 2.67 టీఎంసీలు ఉండటం వల్ల ఉద్దానం ప్రాంతానికి నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

జగన్ ప్రభుత్వ 'భగీరథ'యత్నం

హీరమండలం రిజర్వాయర్ నుంచి ఉద్దానం ప్రాంతానికి నీటి తరలింపు ఆషామాషీ కాకపోయినా ప్రభుత్వం పట్టుదలగా పనులు చేపట్టి పూర్తి చేసింది. ఈ ప్రక్రియలో ఏకంగా 1,047 కిలోమీటర్ల పొడవునా భూగర్భ పైపులైన్ల నిర్మాణం చేశారు. రోజూ 8.40 కోట్ల లీటర్ల మేర తాగునీరు ఆ భూగర్భ పైపు లైను ద్వారా వెళ్లేలా పనులు చేపట్టారు. కేవలం రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ మోటార్లు ఒక్కొక్కటి నిమిషానికి 28 వేలకు పైగా లీటర్ల నీటిని పంపింగ్ చేయగలవు. ఈ నీరు ఎగుడు దిగుడు కొండలు, మైదాన ప్రాంతాలు దాటుకుంటూ.. మధ్యలో మరే మోటార్ల అవసరం లేకుండా 32 కిలోమీటర్ల దూరంలోని మిలియపుట్టి శుద్ధి కేంద్రానికి చేరతాయి. అత్యవసర సమయాల్లో ఉపయోగించడానికి మూడో మోటార్‌ను అదనంగా ఏర్పాటు చేశారు. నీటి తరలింపు మార్గంలో వంశధార నది ఉండటంతో నదీ గర్భంలో దాదాపు అర కిలోమీటర్ మేర పైపు లైన్ నిర్మాణం చేశారు. కొన్ని చోట్ల కొండలను తొలిచి పైప్‌లైన్ వేశారు. ఒక్కసారిగా 73 మీటర్ల ఎత్తుకు.. ఆపై 50 మీటర్లు దిగువకు.. మళ్లీ 147 మీటర్ల ఎత్తున ఉండే కొండపైకి.. మళ్లీ దిగువకు పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. మరో మాటలో చెప్పాలంటే భగీరథ యత్నమే చేశారు.

కరోనా లేకుంటే ఇప్పటికే అందుబాటులోకి..

ఉద్దానం ప్రాంతంలో కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లోని గ్రామాల పరిధిలో కిడ్నీ సమస్య ఉంది. ఈ సమస్యకు అసలు కారణం ఏమిటన్నది ఇంత వరకు స్పష్టంగా నిర్ధారణ కానప్పటికీ.. ఆ ప్రాంత ప్రజలు తాగునీటి అవసరాలకు అక్కడి భూగర్భ జలాలు వినియోగించడం ఒక కారణం కావొచ్చనే నిపుణుల అనుమానాల మేరకే జగన్ ప్రభుత్వం నివారణ చర్యలు మొదలుపెట్టింది. సురక్షిత తాగునీటి సరఫరాకు ఉద్దేశించి ఈ మంచినీటి పథకానికి సీఎం జగన్ 2019 సెప్టెంబర్ 6న శంకుస్థాపన చేశారు. తర్వాతి సంవత్సరంలోనే కరోనా వ్యాప్తి మొదలైంది. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ విధింపు, మరుసటి ఏడాది కూడా రెండో దశ కరోనా వ్యాప్తి కారణంగా ప్రపంచమే స్తంభించిపోయింది. ఈ ప్రభావం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంపైనా పడింది. ఈ సమస్య లేకుంటే ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చి ఉండేది.

బాబు, పవన్.. మాటలతోనే సరి

గత చంద్రబాబు ప్రభుత్వం ఉద్దానం సమస్య పరిష్కారం పూర్తిగా పక్కన పెట్టిందనే చెప్పాలి. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక తొలి మూడు సంవత్సరాల పాటు ఈ సమస్యను పరిష్కరించేందుకు ఒక్క చర్యా చేపట్టలేదు. చివరి ఏడాది 2018లో కేంద్ర పరిశోధన సంస్థ ఐసీఎంఆర్, జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ సంస్థలతో ఉద్దానం కిడ్నీ సమస్యపై పూర్తిస్థాయి అధ్యయనం చేయిస్తామని ప్రకటించారు. అది కూడా ప్రకటనకే పరిమితమైంది. అప్పట్లో తెలుగుదేశం మిత్రపక్షంగా ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ 2018 మే లో ఒకట్రెండు రోజుల పాటు శ్రీకాకుళం జిల్లాలో దీక్షలంటూ హడావుడి చేశారు. ఆ తర్వాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఒకసారి సమావేశమై ఆ సమస్యను పూర్తిగా వదిలేశారు.

ఏపీ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ మద్దతు

- శ్రీకాళహస్తి సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పష్టీకరణ
- రూ.1,680 కోట్లతో ఎయిమ్స్
- 8,744 కి.మీ జాతీయ రహదారుల నిర్మాణం
- తిరుపతిలో ఐఐటీ, ఐసర్ నిర్మాణం
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 23 లక్షల ఇళ్లు
- బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి

సాక్షి, తిరుపతి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్పష్టం చేశారు. రహదారులు, ఇళ్లు, పలు సంస్థల నిర్మాణాలకు ఎంతగానో ఆర్థిక సాయం చేస్తోందన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని బేరివారి మండపం వద్ద శనివారం సాయంత్రం నిర్వహించిన సంపర్క్ అభియాన్ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంగళగిరిలో రూ.1,680 కోట్లతో ఎయిమ్స్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. ఇదే విషయాన్ని మన్ కీ బాత్‌లో ప్రధాని కూడా చెప్పారంటూ గుర్తు చేశారు. రాష్ట్రంలో 8,744 కి.మీ జాతీయ రహదారుల నిర్మాణంతో పాటు రూ.300 కోట్లతో తిరుపతి రైల్వేస్టేషన్‌ను వరల్డ్ క్లాస్ రైల్వేస్టేషన్‌గా ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. తిరుపతిలో రూ.800 కోట్లతో ఐఐటీ, రూ.1,491 కోట్లతో ఐసర్ నిర్మాణంలో ఉందని తెలిపారు. కడప–రేణిగుంట–నాయుడుపేట జాతీయ రహదారిని అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్రానికి లేని విధంగా ఏపీలో పట్టణ ప్రాంత పేదలకు 21 లక్షలు, గ్రామీణ ప్రాంత పేదలకు 2.48 లక్షల ఇళ్లు ఇచ్చామని తెలిపారు. స్వచ్ఛ భారత్ ద్వారా ఏపీలో 42 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం జరిగిందని, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా 3,273 కి.మీ మేర గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఇంతగా కృషి చేస్తున్న బీజేపీకి ఒక్క అవకాశం ఇస్తే రాయలసీమ వెనుకబాటుతనం పోగొట్టడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి మరింతగా బాటలు వేస్తామని స్పష్టం చేశారు.

ప్రపంచ దేశాలకు దీటుగా భారత్

భారత ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో భారతావని ప్రపంచ దేశాలకు దీటుగా అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధిని సొంతం చేసుకుని ప్రపంచ ఆర్థిక రంగంలో పటిష్టంగా నిలిచిందని నడ్డా అన్నారు. ప్రధాని మోదీ రాజకీయాలకు సరికొత్త భాష్యం పలుకుతూ ఓటు బ్యాంకు రాజకీయాలకు దూరంగా బాధ్యత, పారదర్శకతతో కూడిన రాజకీయాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు.



గతంలో కేవలం 59 గ్రామాలకే ఇంటర్నెట్ కనెక్షన్లు ఉంటే ఇవాళ కేంద్రం రెండు లక్షల గ్రామాలకు ఇంటర్నెట్ కనెక్షన్లు ఇచ్చిందన్నారు. 19 వేల గ్రామాలకు సౌభాగ్య పథకం ద్వారా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. 3 లక్షల 28 వేల కిలోమీటర్ల గ్రామసడక్ పథకం ద్వారా గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేసిందని తెలిపారు. ప్రధాన మంత్రి గరీబ్ అన్న కల్యాణ్ యోజన పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో 2 కోట్ల 60 లక్షల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని చెప్పారు. పేదరిక నిర్మూలనను 22 శాతం నుంచి 10 శాతం కంటే తక్కువకు తీసుకొచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. మోదీ ముందు చూపు వల్లే దేశంలో ఆర్థిక వ్యవస్థ నిలకడగా ముందుకు సాగుతోందన్నారు. ప్రపంచ ఆర్థిక రంగంలో భారత్ 5వ స్థానానికి ఎగబాకిందని తెలిపారు.

ఏపీలో అసమర్థ పాలన

ఆంధ్రప్రదేశ్‌లో తాము వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందించి రాష్ట్రాభివృద్ధికి నిధులు అందిస్తున్నప్పటికీ అసమర్థ పాలన కొనసాగుతోందని నడ్డా విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి ఎక్కువైందన్నారు. ఇసుక, మద్యం, ల్యాండ్, మైనింగ్ మాఫియా తారాస్థాయికి చేరిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి ఆనాడు ప్రధాని శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. రాష్ట్రానికి రాజధాని లేకపోవడం శోచనీయమన్నారు. చిత్తూరు జిల్లాకు కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలనలో చంద్రబాబు పక్కదారి పట్టించి అధోగతిపాలు చేశారని ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. రూ.7,400 కోట్లతో కండలేరు జలాశయం నుంచి శ్రీకాళహస్తి, తిరుపతి, మదనపల్లికి నీరందించే బృహత్తర పథకాన్ని చంద్రబాబు రద్దు చేశారని ధ్వజమెత్తారు. తిరుపతిలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం కోసం బీసీసీఐ ముందుకొస్తే భూ సమస్య పరిష్కరించకుండా స్టేడియం ప్రతిపాదనను కూడా రద్దు చేశారని తెలిపారు. హైదరాబాద్ తరహా కన్వెన్షన్ సెంటర్ నిర్మాణానికి అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేత తిరుపతిలో శంకుస్థాపన చేయిస్తే ఆ ప్రాజెక్టునూ టీడీపీ పక్కన పెట్టిందన్నారు. నిమ్జ్‌ను చిత్తూరు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఏర్పాటు చేయాలనుకుంటే దాన్ని కూడా రద్దు చేశారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర పెద్దలను కాకా పట్టడం కోసం సీఎం జగన్ తరచూ ఢిల్లీ టూర్లకు వెళుతున్నారని ఆరోపించారు.

కుత్బుల్లాపూర్ వార్తలు


దేశానికే దిక్సూచిగా మారిన తెలంగాణ



ఏపీ బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

నిజాంపేట్: తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనతోనే ఇది సాధ్యపడిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ అన్నారు. శనివారం రాత్రి నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 300 స్టార్టప్ కంపెనీలు ఉండగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో నేడు 7 వేలకుపైగా ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. హైదరాబాద్ నగరం ఇప్పుడు దేశానికే సాంకేతిక రాజధానిగా రూపాంతరం చెందిందని, ఇదంతా ముఖ్యమంత్రి కేసీఆర్ విధానాలతోనే సాధ్యపడిందన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగారాయప్రసాద్, కార్పొరేటర్లు విజయలక్ష్మి సుబ్బారావు, చిట్ల దివాకర్, సురేష్ రెడ్డి, రాజేశ్వరి, గాజుల సుజాత, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రగిరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న జైహింద్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవిహిల్స్‌లో ఉంటున్న ఎల్లయ్య కుమారుడు కార్తిక్ (25) కొంత కాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవలే నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేసి కాలేయ మార్పిడి చేశారు. ఈ విషయమై ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని సంప్రదించారు. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆదుకుంటానని మాటిచ్చారు. కాగా శనివారం ఎమ్మెల్సీ ఆదేశాల మేరకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు జైహింద్ శనివారం రూ.లక్ష చెక్కును కార్తిక్ తండ్రి ఎల్లయ్యకు అందజేశారు. కార్యక్రమంలో విఠల్, శేఖరెడ్డి, మలచారి, రాజు, ఏడుకొండలు, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి



దుండిగల్: నర్సారెడ్డి భూపతిరెడ్డి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పరిచయం అక్కర్లేని పేరు. కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగిన సీనియర్ నాయకుడు. విద్యార్థి నాయకుడి నుంచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఎదిగారు. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న ఆయన తల్లిగా భావించే కాంగ్రెస్ పార్టీని ఎన్నడు వీడకుండా దశాబ్దాలకు పైగా అదే పార్టీలో కొనసాగుతున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు అందరితో సత్సంబంధాలు కలిగి రాజీవ్ గాంధీ స్ఫూర్తితో గాంధీ కుటుంబంపై అభిమానంతో రాజకీయాలకు వచ్చానని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు.

ఎన్ఎస్‌యూఐ నుంచి మొదలు..

కాలేజీలో చదివే సమయంలోనే నాయకుడి లక్షణాలు కలిగిన ఆయన రాజకీయాన్ని పుణికిపుచ్చుకున్నాడు. 1986–87లో సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ ప్యానెల్ నుంచి వైస్ ప్రెసిడెంట్‌గా, గడిచిన సంవత్సరం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కుత్బుల్లాపూర్ మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, రంగారెడ్డి జిల్లా సేవాదల్ అధ్యక్షుడిగా, కుత్బుల్లాపూర్ మండల పార్టీ అధ్యక్షుడిగా సేవలందించారు.

రేవంత్‌రెడ్డితో సాన్నిహిత్యం..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి భూపతిరెడ్డి సన్నిహితుడిగా మారారు. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాక పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. అదే రీతిలో పార్టీ తలపెట్టిన ప్రతి కార్యక్రమాన్ని భూపతిరెడ్డి విజయవంతం చేశారు. 2021 ఆగస్టు 9న ఇంద్రవెల్లిలో రేవంత్‌రెడ్డి నిర్వహించిన దళిత గిరిజన ఆత్మగౌరవ దండోర సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి 150 వాహనాలు, రావిర్యాల సభకు 200, మూడుచింతలపల్లిలో జరిగిన సభకు 5 వేల మందితో, గజ్వేల్‌లో జరిగిన సభకు 400 వాహనాలతో 6 వేల మందిని తరలించి సభలను జయప్రదం చేశారు. వరుసగా జరిగిన సభలకు జనసమీకరణ చేసిన భూపతిరెడ్డిని రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

◆ రాహుల్‌గాంధీ రాష్ట్రంలో చేపట్టిన హాథ్ సే హాథ్ భారత్ జోడో యాత్రలో బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియల్ సెంటర్ ఆర్గనైజింగ్ బాధ్యతలను చూసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు కాంగ్రెస్ కార్యకర్తలకు రూ.2 లక్షలను రేవంత్‌రెడ్డి చేతుల మీదగా ఇప్పించారు.

కుత్బుల్లాపూర్ కాంగ్రెస్‌లో జోష్..

భూపతిరెడ్డి పూర్తి సమయాన్ని పార్టీకి కేటాయించడంతో కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం వచ్చింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన నాయకత్వంలో నడిచేందుకు ముందుకు వస్తున్నారు. పార్టీ పూర్వ వైభవాన్ని సతరించుకునే విధంగా పయనిస్తున్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో నర్సారెడ్డి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టు ఉంది. 94 వేలకు పైగా పార్టీ డిజిటల్ మెంబర్‌షిప్ చేయించాం. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చా. గాంధీ కుటుంబంపై ప్రత్యేక అభిమానం ఉంది. చనిపోయేంత వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటా. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం.

దివ్యాంగుల పింఛన్ పెంపుపై సర్వత్రా హర్షం

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,116 పెంచుతున్నట్లు ప్రకటించడంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం చింతల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగుల ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ మానవతా చాటుతూ దివ్యాంగులు పింఛన్‌ను పెంచారన్నారు. ఆయన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం అదృష్టమన్నారు. కుటుంబానికి భారం కాకూడదనే దివ్యాంగుల పింఛన్‌ను రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని మాజీ కార్పొరేటర్లు కేఎం గౌరీష్, బొడ్డు వెంకటేశ్వరరావులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తంగ లక్ష్మారెడ్డి, డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు శంకరయ్య, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదన్‌రాజు, కస్తూరి బాల్‌రాజ్, సత్తిరెడ్డి, సమ్మయ్య, తెలంగాణ సాయి, బస్వరాజ్, గౌసుద్దీన్, శేఖర్‌రావు, ఇందిరారెడ్డి, అరుణ, దివ్యాంగులు మల్లారెడ్డి, వెంకటేష్‌గౌడ్, భ్రమరాంబ, రమ, ఉమ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



చింతల్ పార్టీ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఎల్లయ్య విగ్రహానికి నివాళి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్ బస్తీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు ఏడగోటి ఎల్లయ్య 5వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఎల్లయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. బస్తీ ప్రజలకు బిందెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర నాయకులు వేముల లక్ష్మణ్, గుంజా శ్రీనివాస్, ఎత్తరి మారయ్య, మల్లేష్, రషీద్ బేగ్, నాగేష్, తిరుపతి, గంగారం తదితరులు పాల్గొన్నారు.



ఎల్లయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

ప్రజాగర్జన బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. ఈనెల 11న కొత్తగూడెంలో జరిగే ప్రజాగర్జన బహిరంగ సభ పోస్టర్‌ను శనివారం నిజాంపేట్‌లోని వార్డు కార్యాలయం వద్ద ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే ప్రజాగర్జన మహాసభ ముఖ్య ఉద్దేశమన్నారు. సీపీఐ అభిమానులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రకాశం స్టేడియంలో జరిగే సభకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, నర్సమ్మ, యాదమ్మ, లక్ష్మి, నాగమణి, పుష్పమ్మ, అమృతమ్మ, పద్మమ్మ, మహేష్, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ మహాగర్జన సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సుభాష్‌నగర్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం హమీద్ బస్తీకి చెందిన తుకారామ్(30) ఆటో డ్రైవర్. ఇతడికి పదేళ్ల క్రితం వివాహం అయ్యింది. కుటుంబ కలహాల నేపథ్యంలో రెండేళ్ల క్రితం అతడి భార్య లంగర్‌హౌస్‌లో ఉండే పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమెను ఎన్నిసార్లు సర్ది చెప్పినా ఇంటికి తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన తుకారామ్ ఈ నెల 9వ తేదీన రాత్రి 7గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్టీసీ సేవలపై అవగాహన ర్యాలీ

జీడిమెట్ల: పార్శిల్ ఒక చోటు నుంచి మరో చోటుకు భద్రంగా పంపేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్ సిద్ధంగా ఉందని లాజిస్టిక్ ముఖ్య అధికారి మధుసూదన్ అన్నారు. శనివారం జీడిమెట్లలోని పారిశ్రామిక ప్రాంతంలో తెలంగాణ ఆర్టీసీ లాజిస్టిక్స్ ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లాజిస్టిక్స్ అధికారులు మాట్లాడుతూ.. ఆర్టీసీ లాజిస్టిక్స్ ముఖ్య ఉద్దేశం వ్యాపారస్తులు, వర్తకులు, సాధారణ ప్రజలకు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. జీడిమెట్ల డిపో పరిధిలోని జీడిమెట్ల, షాపూర్‌నగర్‌లోని లాజిస్టిక్స్ కౌంటర్స్‌లో బుక్ చేసుకోవచ్చునన్నారు. ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా వస్తువులు భద్రంగా, వేగంగా గమ్యానికి చేర్చవచ్చన్నారు. ఫోన్ నం .91542 98857, 73828 13944, 98660 90719లో లాజిస్టిక్స్ జీడిమెట్ల డిపో పరిధిలో బుక్ చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. ర్యాలీలో కె.వెంకటనారాయణ, శ్రావణ్, సురేష్, ఇతర మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు.



యాజమాన్యం నిర్లక్ష్యంతో కూలీ మృతి

జీడిమెట్ల: సూరారం శ్రీరాంనగర్‌కు చెందిన బట్టు వీరయ్య(56) శనివారం ఉదయం జీడిమెట్ల ఫేజ్–5లోని వేదా ప్రీఫ్యాబ్ పరిశ్రమలో రోజూవారీ కూలీకి వెళ్లాడు. పరిశ్రమ యాజమాన్యం సూచన మేరకు పరిశ్రమ పైకి ఎక్కి రేకులకు మరమ్మతులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం 7గంటల ప్రాంతంలో పాడైపోయిన రేకు విరగడంతో వీరయ్య ఒక్కసారిగా కిందపడిపోయాడు. ఈ ఘటనలో వీరయ్య తల పగిలి తీవ్ర రక్తస్రావం జరగడంతో అక్కడికి అక్కడే మృతిచెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని వీరయ్య కుటుంబీకులు డిమాండ్ చేశారు.